ప్రజాశక్తి
శనివారం 26 ఆగస్టు 2023 5 అనంతపురం



ఎసిబి వలలో వ్యవసాయ అధికారి

ప్రజాశక్తి-అనంతపురం

అవినీతి నిరోధక శాఖ వలలో కూడేరు మండల ఇన్‌ఛార్జి వ్యవసాయాధికారి వెంకటేశ్వర ప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ గిరిబాబు చిక్కారు. ఎరువుల దుకాణం రెన్యూవల్‌కు సంబందించి రూ.15 వేలు లంచం డిమాండ్ చేసిన కేసులో అవినీతి నిరోధక శాఖ అధికారులు వీరిని శుక్రవారం పట్టుకున్నారు. ఈ కేసుకు సంబందించిన వివరాలను డీఎస్పీ వెంకటాద్రి వెల్లడించారు. కూడేరు మండలంలోని మరుట్ల గ్రామంలో బండారు వెంకటేశ్ అనే వ్యక్తి తన గ్రామంలో ఎరువులు, పురుగుల మందుల విక్రయ కేంద్రం ఏర్పాటుకు అనుమతుల కోసం దరఖాస్తు పెట్టుకున్నారు. అనుమతులివ్వడానికి రూ.15 వేలు లంచమివ్వాలని మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వర ప్రసాద్ తన కార్యాలయంలోని జూనియర్ అసిస్టెంట్ గిరాబాబు ద్వారా డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు బండారు వెంకటేశ్ ఎసిబి అధికారులకు సమాచారం ఇచ్చాడు. ఈ నేపథ్యంలో గిరిబాబు రూ.15 వేలు లంచం తీసుకుంటూ ఉండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్టు డీఎస్పీ తెలిపారు. ఈ కేసులో డబ్బులు డిమాండ్ చేసిన ఇద్దరిపైనా కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు. వీరిద్దరినీ కర్నూలులోని ఎసిబి కోర్టులో శనివారం హాజరుపరచనున్నట్లు వివరించారు.

సమస్యలు చర్చకు వచ్చేనా..?

ఎండుతున్న పంటలు
తీవ్రమైన విద్యుత్ సమస్య
నేడు జెడ్పీ సమావేశం



జెడ్పీ సమావేశ భవనం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొన్నాయి. మూడేళ్ల తరువాత కరువు కమ్మేస్తోంది. పంటలు ఎండిపోతున్నాయి. ఈ సమయంలోనే జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం జరుగనుంది. జిల్లా పరిషత్ కార్యాలయంలో జరిగే ఈ సమావేశానికి జెడ్పీటీసీలతో పాటు, మండల పరిషత్ అధ్యక్షులు హాజరుకానున్నారు. తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొన్న తరుణంలో జరిగే ఈ సమావేశానికి అయినా ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరవుతారా లేదా అన్నది చర్చనీయాంశమైంది. గత కొన్ని సమావేశాల్లో చూస్తే ఒకరిద్దరు మినహా తక్కిన నాయకులెవరూ ఈ సమావేశాలకు హాజరవలేదు. ఈ సమావేశానికైన హాజరై జిల్లాలో నెలకొన్న సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తారా లేదా అన్నది చూడాల్సి ఉంది.

తీవ్రమైన విద్యుత్ సమస్య

ఉమ్మడి అనంతపురం జిల్లాలో విద్యుత్ సమస్య తీవ్రమవుతోంది. వ్యవసాయానికి తొమ్మిది గంటలు విద్యుత్ సరఫరా చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఆచరణలో విఫలమైంది. కోతలు తప్పడం లేదు. విద్యుత్ సరఫరా సరిగా లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. దీనిపై రెండు రోజుల వ్యవధిలో 14 మండలాల్లో ఆందోళనలు కొనసాగాయి. ఆరు గంటలు కూడా విద్యుత్ సరఫరా జరగడం లేదని రైతులు ఆందోళనబాట పట్టారు. ఒకవైపు వర్షాభావ పరిస్థితులతో ప్రకృతి వైపరీత్యం నెలకొంటే...విద్యుత్ సరఫరా సమస్యతో బోరు బావుల్లో నీరున్నా పంటలను రక్షించుకునే అవకాశం లేకుండాపోతోంది.

ఎండుతున్న పంటలు

ఉమ్మడి జిల్లాలోని 47 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఆగస్టులో మరింత తీవ్రమైంది. సుమారు ఎనిమిది లక్షల ఎకరాలు ఇప్పటికీ బీడుగా ఉంది. ప్రత్యామ్నాయ పంటల సాగుకు కూడా అనువైన పరిస్థితులు కనిపించడం లేదు. మరోవైపు భూగర్బ జలాలు సైతం రోజురోజుకు పడిపోతుండటంతో రైతులు సహాయం కోసం ప్రభుత్వం వైపు ఎదురు చూసే పరిస్థితులు నెలకొన్నాయి.

తాగునీటి స్కీమ్ కార్మికుల ఆందోళన

ఉమ్మడి జిల్లాలకు తాగునీటిని అందించే సత్యసాయి శ్రీరామిరెడ్డి, సిపిడబ్లుఎస్ తాగునీటి పథకాలన్నింటిలోనూ పనిచేసే కార్మికులకు వేతనాలు ఆరు మాసాలుగా బకాయి ఉన్నాయి. దీంతో కార్మికులు సమ్మెబాట పట్టారు. ప్రతిసారి వేతనాల కోసం కార్మికులు సమ్మె బాటపట్టాల్సి వస్తోంది. ఈ అంశంపై చర్చించి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితి దయనీయం

సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ అధ్వాన్నంగా మారింది. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. కొద్ది రోజులకు ఒకసారి ప్రధాన కాలువకు గండిపడుతోంది. తక్షణ మరమ్మతులకు రూ.30 కోట్లు నిధులు అవసరమని అధికారులు అంచనా వేశారు. నిధులు విడుదల కాకపోవడంతో నిర్వహణ ఇబ్బందికరంగా మారింది. ఈ సమస్యలపై జెడ్పీ సమావేశంలో సభ్యులు గళం విప్పుతారా లేదా అన్నది చూడాల్సుంది.

తల్లిదండ్రులు గర్వించేలా ఉన్నతస్థాయికి చేరుకోవాలి

కలెక్టర్ ఎం.గౌతమి



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఎం.గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం

వైద్య విద్యలో బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు తల్లిదండ్రులు గర్వించే విధంగా ఉన్నతస్థాయికి చేరుకోవాలని కలెక్టర్ ఎం.గౌతమి ఆకాంక్షించారు. శుక్రవారం సాయంత్రం నగరంలోని మెడికల్ కళాశాల ఆడిటోరియంలో 'అధిష్టా 23' పేరుతో కళాశాల డే నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య వృత్తి ఎంతో గౌరవప్రదమైందన్నారు. వైద్య విద్య పూర్తయిన తర్వాత ప్రాక్టీస్ విజయవంతంగా పూర్తి చేసి ప్రజలకు మంచి సర్వీసులు అందించాలన్నారు. ప్రతి ఒక్కరికి గొప్ప భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం 85 మంది అండర్ గ్రాడ్యుయేట్స్‌కు బంగారు పతకాలను ప్రదానం చేశారు. అనంతరం వైద్య కళాశాల ప్రిన్సిపల్, సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్, తదితరులు కలెక్టర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపల్ అరేపల్లి శ్రీదేవి, ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కెఎస్ఎస్ వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపల్ కెఎల్ సుబ్రమణ్యం, షారోన్ సోనియా, బి.ఆర్ శ్యాంప్రసాద్, గోల్డ్ మెడల్ డోనర్స్ వైద్యులు అక్బర్‌సాహెబ్, శ్రీనాథ్, నాగమోహన్, శశిభూషణం, నారాయణప్ప, రంగయ్యశెట్టి, ఆరేపల్లి లక్ష్మి, ఏపీ నరసింహారావు, వైద్య విద్యార్థులు, హౌస్ సర్జన్‌లు, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



సంగ్రామ సైకిల్ యాత్రలో మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు

ఉరవకొండకు చేరుకున్న సంగ్రామ సైకిల్ యాత్ర

ఘనస్వాగతం పలికిన యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-ఉరవకొండ

జిల్లాలో విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన సైకిల్ సంగ్రామ యాత్ర శుక్రవారం రాత్రి ఉరవకొండకు చేరుకుంది. యాత్ర ఉరవకొండకు చేరుకోగానే మండల యుటిఎఫ్ పెద్దఎత్తున ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పట్టనంలోని అంబేద్కర్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు శీను, రాజశేఖర్, రఘు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, ఉరవకొండ నియోజకవర్గ కార్యదర్శి సిద్దార్థ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతున్న సంక్షేమ హాస్టళ్లలో అనేక సమస్యలు నెలకొన్నాయన్నారు. ప్రధానంగా కనీసం తాగడానికి మంచినీరు, నాణ్యమైన భోజనం, మరుగుదొడ్డు వంటి సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఐదు నెలల నుంచి కాస్మొటిక్ ఛార్జీలను పెండింగ్‌లో ఉంచడం వల్ల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదన్నారు. అలాగే చాలా హాస్టళ్ల పాత భవనాల్లో కొనసాగిస్తుండటంతో వర్షాకాలంలో నీరు కారుతుండటంతో విద్యార్థుల విద్యను కొనసాగించాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఇంటర్ విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు పూర్తయినా ఇప్పటి వరకూ కనీసం పాఠ్యపుస్తకాలు ఇవ్వలేదన్నారు. అలాగే విద్యార్థినులపై అత్యాచారాలను అరికట్టాలని, ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్‌ను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఇకపోతే నూతన జాతీయ విద్యా విధానం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు విద్యకు దూరం అవుతున్నారన్నారు. అనంతపురం సెంట్రల్ యూనివర్సిటీలో అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు రజిత, సునీత, ఎస్ఎఫ్ఐ నాయకులు శివ, వైటిసి రమేష్, తరిమెల గిరి, శివ, భీమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి డిఇఒగా నాగరాజు నియామకం



ప్రజాశక్తి-అనంతపురం సిటీ

జిల్లా ఇన్‌ఛార్జి విద్యాశాఖ అధికారిగా నాగరాజును నియమిస్తూ శుక్రవారం సాయంత్రం రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం డిఇఒగా విధులు నిర్వహిస్తున్న ఎం.సాయిరాం బ్రెయిన్ స్ట్రోక్‌తో బెంగళూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఆయన ఆరోగ్యం కుదుట పడేందుకు మరో రెండు మాసాలు పడుతుందని డాక్టర్లు చెప్పారు. దీంతో అనంతపురం డిఇఒ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేస్తున్న నాగరాజును అదనపు డిఇఒగా నియమిస్తూ రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

బకాయి వేతనాలు ఇచ్చాకే విధుల్లోకి....

నిరవధిక సమ్మెలోకి తాగునీటి పథకం కార్మికులు



మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు

ప్రజాశక్తి అనంతపురం, కొత్తచెరువు, పుట్టపర్తి అర్బన్

సత్యసాయి, శ్రీరామ్‌రెడ్డి తాగునీటి పథకం కార్మికులకు బకాయి పడ్డ వేతనాలు చెల్లించేంత వరకు కార్మికులు విధులకు దూరంగా ఉంటారని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు అన్నారు. తాగునీటి పథకం కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసగా కార్మికులు నిరవధిక సమ్మెలోకి వెళ్లారు. ఈ నేపథ్యంలో శుక్రవారం గణేనాయక్ భవన్‌లో శ్రీరామ్‌రెడ్డి తాగునీటి కార్మికుల యూనియన్ నాయకులు, కార్మికుల జనరల్‌బాడీ మీటింగ్ నిర్వహించారు. శ్రీరామ్‌రెడ్డి తాగునీటి కార్మికుల యూనియన్ అధ్యక్షులు బి.నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు మాట్లాడుతూ శ్రీరామ్‌రెడ్డి తాగునీటి పథకం కార్మికులకు 4 నెలల వేతనాలు బకాయి పడ్డాయని, కాంట్రాక్టర్ శివారెడ్డి వేతనాలు, పిఎఫ్, చెల్లించడం లేదని అన్నారు. గత బకాయిలు కూడా చెల్లించాల్సి ఉందన్నారు. 2023 ఏప్రిల్ నుంచి పిఎఫ్ ఎవరు చెల్లిస్తారో రాతపూర్వకంగా ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ డిమాండ్లు నెరవేర్చిన తరువాతనే కార్మికులు చర్చలకు వస్తారని ప్రభుత్వానికి, అధికారులకు తెలిపారు. అంత వరకు సమ్మె కొనసాగుతుందని అన్నారు. పోలీసులు, అధికారులు, కాంట్రాక్టర్‌లు కార్మికులకు ఫోన్ చేయరాదని సమావేశంలో నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం.నాగమణి, నగర కార్యదర్శి వై.వెంకటనారాయణ, కార్మికులు డివిజన్ బాద్యులు యం.నాగరాజు, కోశాధికారి వన్నూరుస్వామి, రాముడు, ప్రభాకర్, గంగాధర్, రామాంజనేయులు, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై నిరసన :

తమ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసగా కొత్తచెరువు మండలం కేసాపురం సమీపంలో సత్యసాయి కేంద్రం వద్ద కార్మికులు శుక్రవారం ఆందోళనకు దిగారు. సత్యసాయి నీటి పథకం పంప్‌హౌస్ ఎదురుగా మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈనెల 25వ తేదీ నుండి ఆందోళన చేస్తున్న ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పనిసరి పరిస్థితుల్లో విధుల్లోకి వెళ్లాల్సి వచ్చిందన్నారు. గురువారం నుండి నిరవధిక సమ్మెలోకి వెళ్ళామని తద్వారా ప్రజలకు తాగునీటి ఇబ్బందు ఏర్పడితే అందుకు పూర్తి బాధ్యత ప్రభుత్వం వహించాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్య సాయి వాటర్ సప్లై ప్రాజెక్టు వర్కర్ స్ట్రగుల్ కమిటీ సభ్యులు ఎన్ శ్రీనివాసులు రాము, కార్మికులు పాల్గొన్నారు.

అర్థ నగ్న ప్రదర్శన : పుట్టపర్తి పట్టణంలోని పంప్ హౌస్ వద్ద సత్యసాయి త్రాగునీటి సరఫరా కార్మికులు అర్థ నగ్న ప్రదర్శనతో నిరసన తెలిపారు. విధి లేని పరిస్థితులలో సమ్మెలోకి వెళుతున్నామన్నారు. తమ సమస్యలను పరిష్కరించేదాకా సమ్మె కొనసాగుతుందని తెగేసి చెప్పారు. వీరి నిరసనకు టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు మధు, శ్రీనివాసులు నాయుడు, రవి, చందు, చంద్ర, వేణు తో పాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు..

సమస్యలు పరిష్కరిస్తేనే విధుల్లోకి...

శ్రీసత్యసాయి కార్మికులకు బకాయి వేతనాలు, పిఎఫ్, గ్రాట్యూటీ చెల్లించిన తరువాతనే కార్మికులు విధుల్లోకి వస్తారని శ్రీసత్యసాయి తాగునీటి పథకం కార్మికుల స్ట్రగూల్ కమిటి నాయకులు అధికారులకు తెలిపారు. శ్రీసత్యసాయి కార్మికులు గురువారం అర్ధరాత్రి నుంచి సమ్మెలోకి వెళ్లారు. దీంతో స్ట్రగూల్ కమిటీ నాయకులు, కార్మికులతో కార్మిక శాఖ అధికారులు శుక్రవారం చర్చలు నిర్వహించారు. కార్మిక శాఖ ఉప కమిషనర్ రఘురాములు, ఆర్‌డబ్యూఎస్ డిఇ శ్రీనివాసులు, స్ట్రగూల్ కమిటీ నాయకులు తిరుపాల్ నాయక్, శ్రీనివాసులు, శ్రీరాములు, ఉపేంద్ర, గోవిందు, కెవి.రమణ ఈ సమావేశానికి హాజరయ్యారు. సమ్మె విరమించాలని ఈసందర్భంగా అధికారులు సూచించారు. దీంతో నాయకులు తమ సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె విరమించేది లేదని తెగేసి చెప్పారు. 5 నెలల వేతనాలు, 8 నెలల పిఎఫ్, 18 నెలల ఇఎస్ఐ, 2 సంవత్సరాల లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, బోనస్ చెల్లించాలన్నారు. చెల్లించేంత వరకు నిరవదిక సమ్మెలో కార్మికులు ఉంటారని చెప్పారు.

జగన్‌తోనే సుపరిపాలన : విప్ కాపు



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-డి.హీరేహాల్

రాష్ట్రంలో ము ఖ్యమంత్రి జగన్‌తోనే సుపరిపాలన సాధ్యమని విప్ కాపు రామచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని మలపనగుడిలో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను విప్ కాపు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చాక సచివాలయం, వాలంటరీ వ్యవస్థను తీసుకొచ్చి గ్రామాలపై పరిపాలన తీసుకొచ్చిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక తమ రాజకీయ మనుగడ కోసం ప్రతిపక్షాలు లేనిపోని విమర్శలు చేస్తున్నాయన్నారు. మండలంలోని మారుమూల ప్రాంతమైన ఒక్క మలపనగుడి పంచాయతీలోనే దాదాపు రూ.40 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. ఇకపోతే నియోజకవర్గంలోని 40 గ్రామాలకు రూ.40కోట్లు ఖర్చు చేసి తుంగభద్ర నుంచి తాగునీరు అందించాలన్న సంకల్పంతో పనులు మొదలు పెట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య, ఎంపిపి పవిత్ర వన్నూరుస్వామి, జడ్పిటిసి హసీనాభాను, సర్పంచులు రుద్రేష్, మండల కన్వీనర్ వన్నూరుస్వామి, వైస్ ఎంపిపి లింగప్ప, డిఇ రామ్మోహన్, సచివాలయ కన్వీనర్ రాళ్ల తిమ్మారెడ్డి, జిల్లా మైనారిటీ నాయకులు రహంతుల్లా, సర్పంచులు హనుమంతురెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మి, బోయ మల్లికార్జున, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా పని చేస్తే విజయం తథ్యం

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో హిందూపురం నియోజక వర్గంలో నేతలందరు సమిష్టిగా కృషి చేస్తే విజయం తథ్యం అని మంత్రి పెదిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దీపిక వేణు రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని మంత్రి పెదిరెడ్డి రామచంద్రారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ హిందూపురం నియోజక వర్గంలో వైసిపికి పెద్ద ఎత్తున ఓటు బ్యాంకు ఉందన్నారు. నేతలందరు ఐకమత్యంతో పని చేస్తే ఇక్కడ విజయం సులభం అన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు ప్రాతినిత్యం వహిస్తున్న కుప్పంలో సైతం గెలవబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. గతంలో జరిగిన స్థానిక సంస్థల, పురపాలక ఎన్నికల్లో కుప్పంలో 90శాతం పైగా స్థానాలను వైసిపి విజయం సాధించిందని మంత్రి గుర్తు చేశారు. హిందూపురంలో నాయకులు విబేధాలు వీడి సమిష్టిగా పని చేస్తే వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో తమ పార్టీ అభ్యర్థి దీపిక వేణు రెడ్డి గెలుస్తుందని జోస్యం చెప్పారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అటు కుప్పం...ఇటు హిందూపురం నియోజక వర్గాలపై ప్రత్యేక దృష్టి సారించారని అన్నారు. ఆ దిశగా ప్రతి కార్యకర్త అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పరిపాలన దేశానికే ఆదర్శం అని తెలిపారు. కేవలం రెండు పేజీల ఎన్నికల అజెండాను రూపొందించి చరిత్రలో ఎప్పుడు లేని విధంగా 52 శాతం ఓట్లు సాధించారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని వైసిపి నాయకులు, కార్యకర్తలు కలసి ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అంతకు ముందు మాట్లాడిన వైసిసి స్థానిక నాయకులు నవీన్ నిశ్చల్, అబ్దుల్ ఘని,వేణు గోపాల్ రెడ్డి, మధుమతి రెడ్డి తదితరులు తాము సమిష్టిగా పనిచేసి దీపిక వేణురెడ్డి విజయం కోసం పని చేస్తామని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో వైసిపి జిల్లా అధ్యక్షులు శంకర్ నారాయణ, ఎంపీ గోరంట్ల మాధవ్, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ, కదిరి, మడకశిర ఎమ్మెల్యేలు సిద్దారెడ్డి, తిప్పేస్వామి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ ఛైర్మన్లు బలరామిరెడ్డి, జబివుల్లా, నియోజక వర్గ వ్యాప్తంగా ఉన్న ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపిలో పలువురు చేరిక

మంత్రి పెదిరెడ్డి రామచంద్రా రెడ్డి సమక్షంలో పలువురు టిడిపి నాయకులు వైసిపిలో చేరారు. ఇటీవల హిందూపురం రూరల్ మండలం చలివెందుల పంచాయతీ ఎన్నికల్లో టిడిపి తరపున పోటీ చేసిన రవీంద్రారెడ్డి తదితరులు పార్టీలో చేరారు. వీరందరికి మంత్రి పార్టీ కండువాలు కప్పి వైసిపిలోకి ఆహ్వానించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి హిందూపురం పర్యటనలో భాగంగ స్థానిక వైసిపి నాయకుల ఇళ్లకు వెళ్లారు. ఎఇ ఆగ్రోస్ చైర్మన్ నవీన్ నిశ్చల్, వైసిపి మాజీ సమన్వయ కర్త కొండురు వేణు గోపాల్ రెడ్డి తదితర నాయకుల ఇళ్లకు వెళ్లివారి అనుచరులతో మాటామంతి చేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ యం.గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన జిల్లా స్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ యం.గౌతమి, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు సంబంధిత శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గుర్తించిన 39 బ్లాక్ స్పాట్‌లను రోడ్డు ప్రమాద రహిత ప్రాంతాలుగా తీర్చిదిద్దాలన్నారు. బ్లాక్ స్పాట్ల వద్ద కాంట్రాక్టర్లతో మాట్లాడి రహదారి అభివృద్ధి పనులు చేపట్టాలని, రెండు నెలల్లోగా చేపట్టిన 45 రకాల పనులను పూర్తి చేయాలని అన్నారు. అతి ముఖ్యమైన బ్లాక్ స్పాట్లను గుర్తించాలని, హై రిస్క్ బ్లాక్ స్పాట్ల వద్ద సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. జాతీయ రహదారుల్లో రోడ్డు ప్రమాదాలు తగ్గించాలని, అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని, ట్రాక్టర్లు, లారీ యజమానులతో సమావేశం నిర్వహించి వారికి రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. జిల్లాలోని కళాశాలల్లో, డిగ్రీ కాలేజీలలో, ఇంజనీరింగ్ కళాశాలల్లో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో గుర్తించిన 39 బ్లాక్ స్పాట్స్ లను డిటిసి, పోలీస్, ఆర్అండ్‌బి, నేషనల్ హైవే, విద్యుత్, తదితర అధికారులు అందరూ కలిసి ఉమ్మడిగా తనిఖీ చేయాలన్నారు. ఈ సమావేశంలో ఉప రవాణా కమిషనర్ వీర్రాజు, సిపిఒ ప్రశాంత్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ యుగంధర్, పీఆర్ ఎస్ఇ భాగ్యరాజ్, జిజిహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఇ దేశేనాయక్, ఆర్అండ్‌బి ఎస్ఇ ఓబుల్ రెడ్డి, ఆర్టీవో సురేష్ నాయుడు, మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్లు అతికానాజ్, రమణారెడ్డి, రవాణా శాఖ ఏవో శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

ప్రజాశక్తి
www.prajasakti.com

రాయదుర్గం ఇన్‌ఛార్జి డిఇపై చర్యలు తీసుకోవాలి

సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం పురపాలక సంఘంలో బాధ్యతా రాహిత్యంగా విధులు నిర్వహిస్తున్న ఇన్‌ఛార్జి డిఇగా పని చేస్తున్న సురేష్‌ని తక్షణమే విధుల నుంచి తొలగించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పురపాలక సంఘంలో గత జూన్‌నెలలో 16 మంది పొరుగు సేవల కార్మికులతో పట్టణంలోని పెద్దమురికి కాలువల్లో నెలరోజుల పాటు పూడికతీత పనులను చేయించారన్నారు. పనులు చేసి మూడు నెలలు గడుస్తున్నా నేటికీ వేతనాలు ఇవ్వలేదన్నారు. వేతనాలు ఇవ్వాలని కార్మికులు మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. వేతనాలు చెల్లించాలని కార్మిక సంఘం నాయకులు వెళ్లి అడగ్గా ఇష్టానుసారంగా మాట్లాడుతున్నాడన్నారు. కార్మికులు, కార్మిక నాయకులతో అవహేళనగా మాట్లాడుతున్న డిఇ సురేష్‌పై వెంటనే చర్యలు తీసుకుని విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు కార్మిక కుటుంబ సభ్యులతో కలిసి మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

డిగ్రీ సెమిస్టర్లలో తెలుగు భాషను కొనసాగించాలి

ప్రజాశక్తి-అనంతపురం

డిగ్రీ సెమిస్టర్లలో తెలుగు భాషను కొనసాగించాలని భాషా అధ్యాపకులు కోరారు. శుక్రవారం నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాకు హాజరైన ఉన్నత విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా భాషా అధ్యాపకులు మాట్లాడుతూ డిగ్రీలో జనరల్ తెలుగు సబ్జెక్టును ఆరు సెమిస్టర్లలో బోధించేందుకు అవకాశం కల్పించాలన్నారు. తెలంగాణలో ఆ రాష్ట్ర ప్రభుత్వం జనరల్ తెలుగు సబ్జెక్టును ఆరు సెమిస్టర్లలో పెట్టి మాతభాష పట్ల అభిమానాన్ని చాటుకున్నారని గుర్తు చేశారు. దేశంలో ఏరాష్ట్రంలో తీసుకురాని సంస్కరణలు మన రాష్ట్రంలో మాత్రమే తీసుకురావడం బాధాకరమన్నారు. కావున దయచేసి కనీసం నాలుగు సెమిస్టర్లలోనైనా జనరల్ తెలుగు సబ్జెక్టుకు వీలు కల్పించాలన్నారు. ఇందుకు కమిషనర్ స్పందిస్తూ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో డాక్టర్ నగరూరు రసూల్, అరుంధతి, డాక్టర్ ఎన్.ఓబిరెడ్డి, ఫిరోజా, పరమేష్, ముత్యాలప్ప, తదితరులు ఉన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ప్రజాశక్తి-ఉరవకొండ



మృతదేహాన్ని అంత్యక్రియలకు తీసుకెళ్తున్న ఆపద్బాంధవ ట్రస్టు సభ్యులు

పట్టణంలోని గవిమఠం పరిసరాల్లో మతిస్థిమితం లేని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందడంతో ఆపద్బాంధవ ట్రస్టు సభ్యులు శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. వివరాల్లోకి వెళ్తే.. గత కొన్ని రోజుల నుంచి గవిమఠం వద్ద మతిస్థిమితం లేని వ్యక్తి తిరుగుతూ ఉండేవాడు. ఈనేపథ్యంలో శుక్రవారం ఉదయం మృతిచెందాడు. గమణించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ వెంకటస్వామి ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనాథ శవం కావడంతో ఖననాన్ని ఎవరూ ముందుకు రాలేదు. దీంతో ఆపద్బాంధవ ట్రస్టు అధ్యక్షులు వేల్పుల మురళి, పంచాయతీ కార్యదర్శి గౌస్‌కు ఎస్ఐ సమాచారం అందించారు. ట్రస్టు బందం, పోలీసులు, గ్రామపంచాయతీ కలిసి పంచాయతీ ట్రాక్టర్‌లో తీసుకెళ్లి గుంతకల్లు రోడ్డు వద్ద ఉన్న శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆపద్బాంధవ ట్రస్టు సభ్యులు వేల్పుల మురళి, నూర్‌బాషా, భీమేష్, అశోక్, రమేష్, నవీన్, పోలీస్ సిబ్బంది శేఖర్, జమేదార్ హిదయ్‌తుల్లా, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

ఉరవకొండ నుంచి అరుణాచలానికి ఆర్టీసీ బస్సు

ఉరవకొండ : ఉరవకొండ నుంచి తమిళనాడులోని అరుణాచలం వెళ్లేందుకు ఈనెల 31న ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును ఏర్పాటు చేసినట్లు ఏపీఎస్ఆర్టీసీ డిపో మేనేజర్ బాలాజీదాయల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు పెద్దలకు రూ.1570, చిన్నారులకు రూ.850గా టిక్కెట్ ధర నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే తిరుగు ప్రయాణంలో కాణిపాక వరసిద్ధి వినాయక క్షేత్రాన్ని చూపించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రహదారుల నాణ్యత పరిశీలన

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలోని శ్రీరంగాపురం క్యాంపు నుంచి కలగానహళ్లి దాకా నూతనంగా నిర్మించిన ప్రధాన రహదారి నాణ్యతను కళ్యాణదుర్గం పంచాయతీరాజ్ శాఖ ఇఇ మల్లికార్జున మూర్తి శుక్రవారం పరిశీలించారు. ఇందులో భాగంగా రూ.50 లక్షలతో కబ్బాల వంకపై నిర్మించిన కాజ్‌వేను తనిఖీ చేశారు. ఈ కాజ్‌వేను క్వాలిటీ కంట్రోల్ నిబంధనల మేరకు నిర్మించినట్లు తెలిపారు. అంతేకాకుండా రహదారికి ఇరువైపులా ప్రమాద హెచ్చరికలు బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే రూ2.50కోట్లతో చేసిన పనులతోపాటు గౌనూర్‌కి వెళ్లే రెండు రూ.30 కోట్ల బీటీ రోడ్డును తనిఖీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఇ తిరుమలరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, రాయదుర్గం పంచాయతీరాజ్ శాఖ డీఈ రామ్మూర్తిరెడ్డి, అసిస్టెంట్ ఏఈ రామాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

'సత్యసాయి' కార్మికుల సమ్మె

గ్రామాలకు నిలిచిన నీటి సరఫరా

ప్రజాశక్తి-ఉరవకొండ



ఉరవకొండలో ఆందోళన చేస్తున్న సత్యసాయి కార్మికులు

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు పిలుపుమేరకు సత్యసాయి తాగునీటి కార్మికులు సమ్మెలోకి వెళ్లారు. ఈమేరకు శుక్రవారం ఉరవకొండ నియోజకవర్గం పరిధిలోని శ్రీసత్యసాయి పంప్‌హౌస్ వద్ద పెద్దకౌకుంట్ల, రాంపురం, గడేకల్, ఛాయాపురం, కొనకొండ్ల తదితర పంప్‌హౌస్‌ల వద్ద మోటార్లు ఆఫ్ చేసి సమ్మెకు వెళ్లినట్టు కార్మిక సంఘం నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు సమ్మె చేయడం ద్వారా దాదాపు 57 గ్రామాలకు శ్రీసత్యసాయి తాగునీరు సరఫరా ఆగిపోయిందన్నారు. కార్మికులతో వెట్టి చాకిరీ చేయించుకుంటూ ఐదునెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేయడం సమంజసం కాదన్నారు. పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే ఇవ్వాలని, లీవ్ ఎంగేజ్‌మెంట్ బోనస్, సమానపనికి సమాన వేతనం, గ్రాట్యూటీ, పిఎఫ్, ఇఎస్ఐ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదన్నారు.

నార్పల : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శ్రీ సత్యసాయి నీటి పథకం కార్మికులు శుక్రవారం నిరవధిక సమ్మె చేపట్టారు. ఇందులో భాగంగా మండల పరిధిలోని బి.పప్పూరులోని పంప్‌హౌస్ వద్ద కార్మికులు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాగునీటి నీటి పథకానికి నిధులు కేటాయించాలని, కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఆయా సమస్యలు పరిష్కరించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. గత్యంతరం లేక సమ్మెకు దిగామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పకడ్బందీగా ఓటరు జాబితా తయారు చేయాలి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం



కళ్యాణదుర్గం సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి నిశాంత్‌రెడ్డి

పకడ్బందీగా ఓటరు జాబితా తయారీ చేపట్టాలని ఎన్నికల అధికారి నిశాంత్‌రెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక ఆర్‌డీఓ కార్యాలయంలో వివిధ మండలాల తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటి సర్వేలో భాగంగా ఫారం -6,7,8లలో వచ్చిన వినతులను క్షుణ్ణంగా పరిశీలించి ఎలాంటి అవకతవలకు తావులేకుండా నూతన జాబితాను తయారు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ విధించిన గడువులోపు తమకు కేటాయించిన పోలింగ్ బూత్‌లకు సంబంధించిన పూర్తి వివరాలతో డేటాను సమర్పించాలన్నారు. ఎక్కడైనా అవకతవకలకు పాల్పడినట్లు తేలితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల బీఎల్ఓలు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

గుత్తి : బూత్ లెవల్ అధికారులు ఓటరు జాబితాను పకడ్బందీగా తయారు చేయాలని గుంతకల్లు ఆర్డీవో రవీంద్ర సూచించారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాపై విచారణ చేపట్టాలన్నారు. డబుల్ ఎంట్రీలు, సరైన కారణాలు ఉంటేనే ఓటరు జాబితా నుంచి పేరు తొలగించాలన్నారు. తప్పులు తడకగా ఓటరు జాబితా ఉండరాదన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషా, కమిషనర్ జి.శ్రీనివాసులు, ఇన్‌ఛార్జి ఎంపిడిఓ శివాజీరెడ్డి, ఉప తహశీల్దార్ విహెచ్.లలిత, సిఎస్‌డిటి కె.సూర్యనారాయణ, ఆర్ఐ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేష్‌పై పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు

ప్రజాశక్తి-అనంతపురం



ఆత్మకూరులో పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న వైసిపి సోషల్ మీడియా ప్రతినిధులు

యువగళం పాదయాత్ర వేదికగా టిడిపి కార్యకర్తలను రెచ్చగొట్టి రాష్ట్రంలో శాంతిభద్రతలకు భంగం కలిగిస్తున్న టిడిపి నేత నారా లోకేష్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ అనంతపురం 2వ పట్టణం పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసులుకు వైసిపి సోషల్ ప్రతినిధులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా సోషల్ మీడియా అధ్యక్షుడు నరేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో గెలవలేమని భావించిన టిడిపి నాయకులు నారాలోకేష్ ఎలాగైనా అధికారంలోకి రావాలని టీడీపీ కుట్రలు చేస్తోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇందులో భాగమే మాచెర్ల, పుంగనూరు ఘటలు అని గుర్తు చేశారు. దీనికితోడు 'మీ మీద ఎన్ని ఎక్కువ కేసులు ఉంటే నామినేటెడ్ పదవులు ఇస్తాం' అని నారా లోకేష్ బహిరంగంగా మాట్లాడి దాడులకు ప్రేరేపించడమే అని తెలిపారు. ఎర్రపుస్తకం పేరుతో ప్రజలకు ఏం సందేశం ఇస్తున్నారని ప్రశ్నించారు. వెంటనే నారా లోకేష్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా కన్వీనర్ గోళ్ల శ్రావణ్‌రెడ్డి, ఐటి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముకుందాపురం ప్రతాప్‌రెడ్డి, ఐటి విభాగం జిల్లా అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, జిల్లా కో కన్వీనర్ నాని, ప్రతినిధుల సాయిప్రవల్లిక, జీఎస్.రాజు, జిలాన్, ప్రసాద్, నరేష్, నరసింహా, హరి, రమేష్, అమర్నాథ్ పాల్గొన్నారు.

గుత్తి : యువగళం పాదయాత్రలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యాఖ్యలు చేస్తున్న టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌పై చర్యలు తీసుకోవాలని వైసిపి సోషల్ మీడియా నాయకులు శుక్రవారం గుత్తిలో సీఐ ఎం.వెంకటరామిరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా నియోజకవర్గ కో కన్వీనర్ వి.వరదరాజులు, సచివాలయాల సోషల్ మీడియా కన్వీనర్ వాల్మీకి శివ, మండల సోషల్ మీడియా కన్వీనర్ జేపీ.గాదిలింగ, కో కన్వీనర్లు కరిడికొండ శివ, దేవా, ప్రసాద్, ప్రకాష్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యాఖ్యలు చేస్తున్న టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌పై చర్యలు తీసుకోవాలని మండల వైసిపి సోషల్ మీడియా నాయకులు శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో మండలం సోషల్ మీడియా కో కన్వీనర్ గిరీష్‌రెడ్డి, రూపేష్, రాజశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యం : టిడిపి

ప్రజాశక్తి-ఆత్మకూరు



ఆత్మకూరులో మహిళలకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

టిడిపి అధినేత నారా చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆపార్టీ మండల కన్వీనర్ బోయ శ్రీనివాసులు తెలిపారు. మహాశక్తి చైతన్య యాత్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో ఇంటింటికీ వెళ్లి టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న వివిధ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి హయాంలో అన్ని వర్గాలూ అభివృద్ధి చెందాయన్నారు. అయితే వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. ముఖ్యంగా వచ్చే ఎన్నికల్లో టిడిపిని గెలిపిస్తే అన్ని వర్గాల ప్రజలకు లబ్ది చేకూర్చే విధంగా మేనిఫెస్టోను తయారు చేసినట్లు వివరించారు. కావున రానున్న ఎన్నికల్లో టిడిపి గెలిపించి అభివృద్ధికి బాటలు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు గడిపూడి నారాయణస్వామి, మహిళా కమిటీ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీదేవి, హిందూపురం పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి రామసుబ్బమ్మ, రాములమ్మ, మండల మాజీ కన్వీనర్ సూర్యనారాయణ, మనోరంజని, వేణుగోపాల్, సోషల్ మీడియా అధ్యక్షుడు రంగంపేట బాలు, జొన్నప్ప, బీసీ సెల్ వడ్డే నాగేంద్ర, ఎస్సీ రాజా, రమేష్, తెలుగు యువత అధ్యక్షుడు అంకె ఆనంద, రైతుసంఘం అధ్యక్షుడు దుబ్బ రవీంద్రారెడ్డి, సుధాకర్‌రెడ్డి, కొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ ఆదేశాల మేరకు మండలంలోని నాయనవారిపల్లి గ్రామంలో భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా టిడిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి టిడిపి అధికారంలోకి వస్తే చేపట్టబోయే పథకాలు, చేయనున్న అభివృద్ధిని వివరించారు. అంతేగాకుండా వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ, నాయకులు గుర్రం లక్ష్మీనారాయణ, టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

మండలమీట్‌లో సభ్యుల నిలదీత

ప్రజాశక్తి-ఉరవకొండ



సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని పలువురు ఎంపిటిసిలు, సర్పంచులు అధికారులను నిలదీశారు. శుక్రవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి చంద్రమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షేక్షానుపల్లి, రేణుమాకులపల్లి సర్పంచులు లింగన్న, బోయ రామాంజనేయులు మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి బోర్లు చెడిపోతే మరమ్మతులు చేయడానికి కూడా డబ్బులు లేవన్నారు. నిధులు లేకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటపడిందన్నారు. అప్పటికీ అప్పులు చేసి మరీ కొన్ని పనులు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే గడప గడపకూ కార్యక్రమం కింద మంజూరైన నిధులు కూడా మంజూరు కావడం లేదన్నారు. ఎంపిటిసిలు వన్నూరు సాహెబ్, ఈడిగ ప్రసాద్ మాట్లాడుతూ ఉరవకొండలో తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుడటంతో సమస్య ఉధృతం అవుతోందన్నారు. వీటితోపాటు పలు సమస్యలపై సభ్యులు ఏకరువు పెట్టారు. ఇందుకు ఎంపిపితోపాటు జడ్పిటిసి పార్వతమ్మ స్పందిస్తూ ఆయా సమస్యల పరిష్కారానికి వెంటనే కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నేరమెట్ల సర్పంచి యోగేందర్‌రెడ్డి, వైస్ ఎంపిపి నరసింహులు, ఎంపిడిఒ అమృతరాజు, పలువురు ఎంపిటిసిలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పిఎంఇజిపి లక్ష్యాలను చేరుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పీఎంఈజీపి కింద జిల్లాకు కేటాయించిన లక్ష్యాలను చేరుకోవాలని కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో 44వ జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పీఎంఈజీపి 2023-24 కింద 387 దరఖాస్తులను వివిధ బ్యాంకులకు పంపించగా, నిర్దేశించిన 246 యూనిట్లుగాను 103 యూనిట్లు గ్రౌండింగ్ అయ్యాయని, 118 యూనిట్ల శాంక్షన్ దశలలో ఉండగా, నిర్దేశించిన లక్ష్యాలను త్వరగా చేరుకోవాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది పీఎంఈజీపి కేటాయించిన మేరకు లక్ష్యాలను పూర్తిచేయడం అత్యంత ముఖ్యమన్నారు. ఇందుకోసం బ్యాంకర్లతో లీడ్ బ్యాంకు మేనేజర్ సమావేశం నిర్వహించాలని, అర్హులైన పారిశ్రామికవేత్తలకు రుణాలు మంజూరు చేయాలన్నారు. రాయదుర్గం మండలం 74 ఉడేగోళం వద్ద ఏపీఐఐసీ ఆధ్వర్యంలో 20 ఎకరాల్లో ఏర్పాటుచేసిన టెక్స్టైల్ పార్క్‌లో 40 ప్లాట్లు లబ్ధిదారులకు కేటాయించడం జరిగిందని, కేటాయించిన ప్లాట్లలో పరిశ్రమలు ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. అలాగే రాప్తాడు ఎంఎస్ఎంఈ పార్క్‌లో కూడా అర్హులైన లబ్ధిదారులకు ప్లాట్లు కేటాయించగా, గ్రౌండింగ్ తక్కువగా ఉందని, వెంటనే ప్లాట్లు తీసుకున్న లబ్ధిదారులను పిలిచి మాట్లాడి పరిశ్రమలు ఏర్పాటు చేసేలా చూడాలని, పరిశ్రమలు ఏర్పాటుకు ముందుకు రాకపోతే ప్లాట్లను రద్దు చేయాలన్నారు. ప్రతి మాసం రాప్తాడు పార్కులో స్థాపించబడే యూనిట్లు ప్రగతి నివేదికను సమర్పించాలని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి జి.నాగరాజ రావు, ఏపిఐఐసి జడ్ఎం వరప్రసాద్, ఉప రవాణా శాఖ అధికారి వీర్రాజు, ఏపీఎస్ఎఫ్సి బిఎమ్ మహేష్, అగ్రికల్చర్ జెడి ఉమామహేశ్వరమ్మ, ప్యాప్సి ప్రెసిడెంట్ శేషాంజనేయులు, ప్యాప్సియ ప్రతినిధి నాగరాజు, అసిస్టెంట్ ఎల్డిఎం శ్వేత, సాంఘిక సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు దామోదర్ రెడ్డి, ఫ్యాక్టరీస్ డిప్యూటీ ఇన్స్పెక్టర్ శివయ్య పాల్గొన్నారు.

కుర్చీలు పంపిణీ

శింగనమల : వాటర్ షెడ్ సంస్థ మంజూరైన 40 కుర్చీలను శుక్రవారం మండల పరిధిలోని వెస్టు నరసాపురం గ్రామంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైసిపి మండల కన్వీనర్ పట్నం నగేష్, డీలర్ మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం గ్రామానికి కుర్చీలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాటర్‌షెడ్ ఎఇ శ్రీనివాసరెడ్డి, వర్క్ ఇన్స్‌పెక్టర్ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

ఉరవకొండ : మండల పరిధిలోని చిన్నముష్టూరు, కోనాపురం గ్రామాల్లో రైతులు సాగు చేసిన వేరుశనగ, కంది పొలాలను మండల వ్యవసాయ అధికారి శుభకర్ శుక్రవారం పరిశీలించారు. ఇందులో భాగంగా చిన్నముష్టూరులో రైతు రామాంజనేయులు సాగు చేసిన కంది పొలాన్ని పరిశీలించి వర్షాభావ పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వారం నుంచి పది రోజులు వర్షాలు రాకపోతే పైర్లను కాపాడుకోవాలంటే యూరియా 20 గ్రాములు, ఒక లీటర్ నీటికి లేదా పొటాషియం నైట్రేట్ అయిదు గ్రాములు ఒక లీటర్ నీటికి లేదా 19 19 19 5 గ్రాములు ఒక లీటర్ నీటికి పిచికారి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చిన్నముష్టూరు సర్పంచి రామాంజనేయులు, ఆర్‌బికె సిబ్బంది చిక్కన్న, గోపాల్‌నాయక్, భీమేష్, రైతులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రేషన్‌బియ్యం పట్టివేత



పట్టుబడిన రేషన్ వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

బుక్కరాయసముద్రం : మండలం పరిధిలోని గుత్తి రోడ్డులో కనకదాస కళ్యాణ మండపం ముందు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు సిఐ సాయిప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు..పక్కాగా అందిన సమాచారం మేరకు అనంతపురం ప్రాంతీయ నిఘా, అమలు సిఐ పి.సాయిప్రసాద్, ఎస్ఐ జి.జయపాల్‌రెడ్డి, ఎఇఇ టి.రాజశేఖర్, సిబ్బంది స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి అక్రమ రవాణా చేస్తున్న 42.90 క్వింటాళ్ల (86 ప్లాస్టిక్ బ్యాగులు) ప్రజా పంపిణీ బియ్యాన్ని పట్టుకుని అశోక్ లైలాండ్ వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. అనంతరం పట్టుబడిన బియ్యాన్ని బుక్కరాయసముద్రం తమశీల్దార్ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు. ఈ దాడిలో గుజ్జల సతీష్, మజ్జిగ హరికృష్ణ, కొండూరు మల్లికార్జునపై కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

డెంగీతో చిన్నారి మృతి

నార్పల : మండల పరిధిలోని హెచ్.శోదనపల్లిలో సాకే ఎర్రిలక్ష్మి, రాజారాం కుమార్తె భవిత (7) డెంగీ వ్యాధితో మృతిచెందిన ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లో వెళ్తే.. భవితకు డెంగీ వ్యాధి సోకడంలో తల్లిదండ్రులు అనంతపురంలోని సవీరా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. దీంతో గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

పుట్లూరు : మండల కేంద్రంలో మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. పుట్లూరు గ్రామానికి చెందిన మహిళను ఎస్సీ కాలనీకి చెందిన లక్ష్మీనారాయణ గురువారం రాత్రి ఇంటిపైకి వెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించడంతోపాటు అత్యాచారయత్నానికి పాల్పడినట్లు బాధితురాలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో నిందితుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైసిపి ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా గురురాజ్



కళ్యాణదుర్గం : వైసిపి జిల్లా కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా కళ్యాణదుర్గం వైసీపీ నాయకుడు గురురాజ్‌రాయల్‌ను ఎంపిక చేశారు. తనపై నమ్మకంతో పదవిని కేటాయించిన సిఎం జగన్, మంత్రి ఉషాశ్రీచరణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

సచివాలయ భవనం ప్రారంభం

యాడికి : మండలంలోని నగరూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం, సచివాలయం, విలేజ్ హెల్త్‌క్లినిక్ కార్యాలయాలను ఎమ్మెల్యే పెద్దారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే పెద్దారెడ్డిని ఎమ్మార్పీఎస్ నాయకులు నరసింహులు, ఆదినారాయణ తదితరులు గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఉమాదేవి బొంబాయి రమేష్, మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు, మాజీ జెడ్పీటీసీ వెన్నపూస పెద్ద వెంకటరామిరెడ్డి, యాడికి సర్పంచి పందు అనురాధ, ఉప సర్పంచి కాసా చంద్రమోహన్, భోగాతి బ్రహ్మానందరెడ్డి, బాలరమేష్, ఎంపిటిసి వెంకటనాయుడు, తలారి నాగేష్, ఆవుకు నాగరాజు, రామ్మోహన్, వల్లూరు వెంకటనాయుడు, తిరుపతి, ఆల శివప్రసాద్, టీవీ ప్రసాద్, బాల చైతన్య, కోట, కోటి, రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌పై సమావేశం

గుత్తి : జాతీయ లోక్ ఆదాలత్‌పై స్థానికన్యాయస్థానాల ప్రాంగణంలో న్యాయమూర్తులు శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ వచ్చేనెల 9న నిర్వహించనున్న జాతీయ లోక్ ఆదాలత్‌లో అధికంగా కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల న్యాయ సేవా సమితి అధ్యక్షులు, జిల్లా 6వ అదనపు న్యాయమూర్తి డి.శ్రీనివాసులు, జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ వి.దీప్తి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె. మనోహర్ బాబు, న్యాయవాదులు ఎ.రామ్మోహన్‌రెడ్డి, విసి.గంగాధర్‌కుమార్, ధనుంజయ, మహమ్మద్ రసూల్, నూర్ మొహమ్మద్, ఫక్రుబాషా, ఎ.సూర్యనారాయణ, కోర్టు సిబ్బందిపాల్గొన్నారు.

28న వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్టాపన

గార్లదిన్నె : మండలంలోని మర్తాడు గ్రామంలో ఈనెల 28న నిర్వహించనున్న వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో జిల్లాలోని వాల్మీకి సోదరులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వాల్మీకి సంఘం కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. 27వ తేదీ నుంచి 28వతేదీ సోమవారం వరకూ పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆరోజు సూర్యోదయం 3-10కు విగ్రహ ప్రాణప్రతిష్ట, అభిషేకం, పూజ, పూర్ణాహుతి వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో వాల్మీకులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సచివాలయం తనిఖీ

పుట్లూరు : మండల పరిధిలోని కందికాపుల సచివాలయాన్ని ఎంపిడిఒ యోగానందరెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆధార్ క్యాంప్, హాజరు పట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ బీమా, జగనన్నకు చెబుదాం, స్పందనలో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. అదేవిధంగా డ్రాపౌట్ పిల్లలను గుర్తించి, వారిని పాఠశాలల్లోకి చేర్పించేందుకు కృషి చేయాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగంపై శిక్షణ

నార్పల : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో మండల వ్యవసాయ అధికారి చిన్న వీరాస్వామి ఆధ్వర్యంలో రైతు భరోసా కేంద్రాల ఇబ్బందికి పంట కోత ప్రయోగాలపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ఖరీఫ్-23లో సాగు చేసిన పంటలను పకడ్బందీగా ఈక్రాప్ బుకింగ్ చేయాలన్నారు. అలాగే పంటకోత ప్రయోగాలపై అవగాహన ఉండాలన్నారు. ఈక్రాప్ బుకింగ్ చేసుకుంటేనే ప్రభుత్వ పథకాలు వర్తిసాయన్నారు. కావున ప్రతి రైతూ సాగు చేసిన పంటలను నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ గణాంక అధికారి జె.కృష్ణయ్య, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

వర్షం కోసం బుదగవిలో గంగపూజ

ఉరవకొండ : వర్షం కోసం మండల పరిధిలోని బుదగవి గ్రామంలో శుక్రవారం గ్రామస్తుల ఆధ్వర్యంలో గంగపూజ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు భీమేష్, రమేష్, వరదరాజు, రామాంజి, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల ప్రార్థన

రాయదుర్గం రూరల్ : వర్షం కురవాలని మండల పరిధిలోని జుంజరంపల్లి గ్రామంలో ముస్లిములు వేరుశనగ పొలంలో శుక్రవారం ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. వర్షాభావంతో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొంటున్నాయని, అల్లా కరుణించి వర్షం కురిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముతవల్లి మాబుపీరా, మౌజన్ హుస్సైన్, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

శింగనమల : వర్షాభావం కారణంగా పంటలు ఎండిపోతున్న నేపథ్యంలో తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టి రైతులను ఆదుకోవాలని ఏపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.చిన్నప్పయాదవ్ డిమాండ్ చేశారు. మండలంలోని మట్లగొంది, సలకంచెరువు గ్రామాల్లో ఎండలకు ఎండిన వేరుశనగ పొలాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా దాదాపు 4 లక్షల హెక్టార్లలో వివిధ రకాల పంటలను సాగు చేశారన్నారు. అవన్నీ ప్రస్తుతం వర్షాలు కురవకపోవడంతో ఎండుదశకు చేరుకున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏపి రైతుసంఘం మధుయాదవ్, రాము, కుళ్లాయప్ప, నాగబయన్న, రాజు పాల్గొన్నారు.